# శాంతి

# SANTI

విశ్వమానవ సాభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

December / డిశంబర్-2024

ॐ

ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయోభవేత్

ఏకం సత్ విప్రా బహుధా వదంతి
ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.
- ఋగ్వేద సంహిత

# శాంతి
# SANTI

**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

VoL./ సంపుటి : 100 December / డిశంబర్-2024 No./ సంచిక : 12

| వ.నెం. | విషయసూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన- భగవద్గీత ప్రార్థన | 2 |
| 2. | ధ్యానము - ఆత్మవిద్యావిలాసము | 2 |
| 3. | శ్రీ ఓంకార్ ఆత్మకథ - అనువాదం : బొప్పన అరుణాదేవి | 3 |
| 4. | ఆనంద రామాయణము - పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద | 9 |
| 5. | గురువాచకకోవై - మురుగనార్ | 12 |
| 6. | మానసోల్లాసము - శ్రీ వింజమూరి రాధాకృష్ణ | 15 |
| 7. | భయం - యన్.వి. శాంతిరెడ్డి | 18 |
| 8. | వాక్‌శుద్ధి - స్వామి ఓంకార్ | 21 |
| 9. | కార్యక్రమములు - విరాళములు | 25 |

**ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులుకాని, సంపాదకులు కారు.**

**జీవిత సభ్యత్వం రూ. 1000/- లు సాలుసరి రూ. 100/-**



# ప్రార్థన

**తీవ్రధ్యానంలో ఇంద్రియాలు కట్టుబడతాయి**

**శ్లో॥** యంబ్రహ్మావరుణేంద్ర మరుతః స్తున్వంతః దివ్యైః స్తవైః ।
వేదైస్సాంగ పదక్రమోపనిషదై ర్గాయంతి యంసామగాః ॥
ధ్యానవస్థిత తద్గతేన మనసా పశ్యంతియంయోగినో ।
యస్యాంతం న విదుస్సురాసురగణాదేవాయ తస్మై నమః ॥

**తా॥** ఆ పరమాత్మను బ్రహ్మదేవుడు, వరుణుడు, ఇంద్రుడు, రుద్రులు, మరుద్గణములు, దివ్యములైన స్తోత్రములతో స్తుతించుచున్నారు. సామవేద విద్వాంసులు, అంగములు, పదము, క్రమము, ఉపనిషత్తులతో కూడిన ఆ పరమాత్మను కీర్తించుచున్నారు. యోగులు ధ్యానముచే మనస్సును నిశ్చలముగా తల్లీనము చేసి ఆ పరమాత్మను ధ్యానించుచున్నారు. దేవతల మరియు రాక్షసుల గణములకు ఆ పరమాత్మయొక్క పూర్ణతత్త్వము తెలియదు. ఆ స్వయంప్రకాశ పరమాత్మకు నమస్కారము.

**(భగవద్గీత ధ్యానము)**

# ధ్యానము

**శ్లో॥** యాచిత్ప్రభా త్వమితి విభాసయిత్రీ
యత్సంక్రమాద్ఘటపటా వ్యవభాషితాకాథః ।
ఆ బ్రహ్మకీట మహామిత్యవ భాసమానా
యా సైవ సంవిదతి చింతయ సంతతం త్వమ్ ॥

**తా॥** ఏ చిత్తు యొక్క ప్రకాశం విషయ వస్తువుల్ని 'నీవు"గా వెలిగించి చూపుతుందో, దేని ప్రసరణవల్ల బుద్ధి ఘటాన్ని, పటాన్ని విచక్షింప గలుగుతుందో, దేనివల్ల బ్రహ్మ నుండి పురుగు వరకు 'నేను' అనే భావం వెలుగుతుందో అదే సంవిత్తు అని నీవు నిరంతరం భావన చెయ్యి. **(ఆత్మ విద్యా విలాసము)**

మీకు లభించిన మానవజన్మను వ్యర్థపుమాటలతో, వ్యర్థపు పనులతో వృథా చేయక కాలము యొక్క విలువను గ్రహించి నిరంతర దైవజ్ఞప్తితో, పరోపకారయుత, సత్కార్యములతో వినియోగించి తరించెదరుదాక! భౌతిక కాయములు ఎప్పటికైనను నశించును. కీర్తికాయము నశించదు. భగవంతుని లీలలను కీర్తించుటవలన నీ యింద్రియములు అనగా నీ నోరు పవిత్రతనొందును. కాలము సద్వినియోగమగును. కాలము యొక్క విలుగను గుర్తించి తరించుటయే ముక్తికి మార్గము

**-స్వామి ఓంకార్**

# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామిజీ ఆత్మకథ

**మూలం : స్వామిఓంకార్** **అనువాదం : బొప్పన అరుణాదేవి**

(గత సంచిక తరువాత) **అధ్యాయం - 56**

## మౌన యజ్ఞము

ఈ మౌనయజ్ఞము జనవరి 21వ తేదీ 1951వ సంవత్సరంలో మొదలు పెట్టాను. కైలాసగిరిపైన, కేవలం నా వ్యక్తిగత శాంతికోసం కాకుండా ప్రపంచ ప్రజలందరికీ శాంతికోసం నేను మౌనయజ్ఞము ఆరంభించాను. భగవంతుని అనుగ్రహము వలన నా లోపల కలిగిన ప్రేరణను అనుసరించి మౌనయజ్ఞము కొనసాగించటం వలన దగ్గరిలోని వారే కాకుండా సుదూరప్రాంతాల్లోని వారు కూడా తేలికగా అక్కడికి చేరుకుని భగవంతుని దివ్యానుభూతిని పొందగలిగారు. ప్రపంచంలోని ఏ మూల నుండయినా ఎవ్వరయినా ఇందులో పాలుపంచుకో వచ్చును. ఎందుకంటే ఇది ప్రతి ఒక్కరికి కూడా, భగవంతుని బిడ్డలందరికీ, జాతి, మతము, దేశము అనే బేధము లేకుండా, వారికి ఇందులో నమ్మకం ఉన్నా లేకపోయినా కూడా అందుబాటులో ఉంటుంది. కైలాస ఆశ్రమము హృదయ పూర్వకంగా ప్రతి ఒక్కరిని ఆహ్వానిస్తోంది. పాత, క్రొత్త మతాలను అనుసరించే వారందరిని కూడా ఈ మౌనయజ్ఞంలో పాల్గొనవలసిందిగా కోరుతోంది.

ఈ యజ్ఞంలో ప్రధాన పూజారి అహంకారము, బుద్ధి, అగ్నిహోత్రము, ఆలోచనలు అనే సమిధలను యజ్ఞంలో శ్వాస అనే నెయ్యితో వేల్చాలి. ఈ మౌన యజ్ఞంలో ప్రధానమయిన మహా మంత్రము 'సోహం'. అన్ని మతాలకి కూడా మూల మంత్రము 'అజప' అనే మాట పవిత్రము, నోటితో ఆ పవిత్ర మంత్రాన్ని నిరంతరం జపిస్తూ ఉండాలి. ఈ పవిత్ర యజ్ఞము రాత్రింబవళ్ళు నిరంతరాయంగా జరగాలి. ప్రతి వ్యక్తి హృదయంలో ఆధ్యాత్మిక జ్ఞానజ్యోతిని వెలిగించటమే ఈ యజ్ఞం యొక్క ప్రధాన లక్ష్యము. ప్రతి ఒక్కరికి శాంతి కలగాలని, భూమిపై శాంతి నెలకొల్పాలని, అన్ని జాతుల వారికి శ్రేయస్సు కలగాలని, ప్రపంచంలోని అన్ని దేశాలు సుఖసంతోషాలతో, సౌభాగ్యంతో వర్ధిల్లాలని ఈ యజ్ఞం యొక్క లక్ష్యము.

అన్ని యజ్ఞాల్లోకి మౌనయజ్ఞము చాలా గొప్ప శక్తివంతమయినది. ప్రభావం చూపించేది. దాని ఉపయోగాన్ని నేను మాటల్లో మీకు వివరించి చెప్పలేను. అది



సాధ్యం కాదు. అంత పవిత్రమయినది. వర్ణించడానికి సాధ్యము కానిది. అది అనిపించటం కాదు. దాన్ని మౌనంగా అనుభూతి చెందాలి. జీవుడు తన హృదయ క్షేత్రంలో కొలువైన అంతర్యామిగా ఉన్న పరమ శ్రేష్ఠమయిన ఆది సత్యము 'నేను' గా ప్రకాశిస్తున్న దేవాదిదేవుడిని అనుభూతి చెందాలి. చాలా చిన్నదయిన విలువలేని, పరిమితమయిన అహంభావాన్ని ఈ మౌనయజ్ఞంలో కాల్చివేయాలి. ఈ పవిత్ర మయిన యజ్ఞము కేవలము కైలాసగిరి లేదా భారతదేశంలోని సన్యాస ఆశ్రమ సంప్రదాయానికి మాత్రమే చెందినది కాదు. దీనికి మూలము పూర్తి ప్రపంచానికి చెందినది. మరి ఈ మౌనయజ్ఞము ఎప్పుడు పూర్తి అవుతుంది? అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఎప్పుడయితే అహంభావన పూర్తిగా నశిస్తుందో, మౌనము అనే అగ్నిలో అది పూర్తి దగ్ధం అయిపోతుందో, నామరూపాలు కూకటివేళ్ళతో సహా పెకిలించబడతాయో అప్పుడు మాత్రమే ఈ యజ్ఞము పరిసమాప్తమవుతుంది.

ప్రియమైన పాఠకులారా! మీరు ఎవరయినా, ఎక్కడివారయినా, ఏ పనిలో మీరు నిమగ్నమయి ఉన్నా ఈ మహోన్నతమయిన మౌన యజ్ఞానికి మీకందరికి స్వాగతం పలుకుతున్నాను. అందరికి శాంతి, మౌనము, విజ్ఞత కల్గటమే ఈ యజ్ఞము యొక్క ఆశయము, అభిలాష, గమ్యము. ఈ వైభవోపేతమయిన ఆచరణ అనేది వ్యక్తిగత శాంతినుండి మొదలవుతుంది. మీకు కైలాసగిరి ఆశ్రమానికి రావటానికి అనుకూలత లేకపోయినప్పటికీ మీరున్న స్థలం నుండే మీ ఆలోచనలు కనీసం మాతో కలిపి జతకలపండి, మీకు ఎప్పుడు అవకాశము, సానుకూలత ఏర్పడితే అప్పుడే ఆ పనిచేయండి. ఈ యజ్ఞము ఉషోదయము నుండి సూర్యాస్తమయం వరకు, తిరిగి సూర్యాస్తమయం నుండి ఉషోదయం వరకు నిరంతరాయంగా జరుగుతూ ఉంటుంది. ఎలాంటి ఆటంకము ఉండదు.

దయచేసి ప్రార్థిస్తున్నాను. ఈ యజ్ఞ ప్రసాదాన్ని స్వీకరించండి. అదే విశ్వ ప్రేమ. అది అందరినీ అంతులేని శాంతిలో శాశ్వతమయిన శాంతితో ముంచి వేస్తుంది. దివ్యప్రకాశము, దివ్యమయిన జీవితము, ఆద్యంతములు లేని శక్తి, వీటన్నింటిని మించి నిశ్చలమయిన నిశ్శబ్దంలో మౌనంలో, పరమ శ్రేష్ఠమయిన, మహోన్నతమయిన ప్రశాంతతలో, ఆధ్యాత్మిక జ్ఞానమనే అగ్నిలో మిమ్మల్ని నింపివేసి, చుట్టి వేస్తుంది. దయచేసి దానిని స్వీకరించండి. మౌనము జీవుడి హృదయము. అదే అతడి ప్రాణశక్తి. విశ్వానికి అదే శ్వాస.

## ఆరు సంవత్సరాల నా మౌనదీక్ష

ఆశ్రమ భక్తుడు ఒకరు నేను ఆరు సంవత్సరాలు మౌనదీక్షలో ఉన్నప్పుడు పొందిన ఆధ్యాత్మిక అనుభవాలను వ్రాయవలసిందిగా అభ్యర్థిస్తూ ఉత్తరము వ్రాశాడు. వివిధ దేశాల్లోని అతని స్నేహితులకు ఉపకరించే విధంగా అతను వాటిని జర్మన్, రష్యన్ భాషల్లోకి అనువాదం చేయాలని అతని అభిలాష, వారికి ఇంగ్లీషు చదవటం రాదు. అతని కోరిక మేరకు ఈ సందేశాన్ని వ్రాయటం జరిగింది.

సందేశాన్ని ప్రారంభించడానికి ముందుగా ఆరు సంవత్సరాల సుదీర్ఘమయిన నా మౌనదీక్ష ఆరురోజుల్లాగా గడిచిపోయిందని చెప్పాలి. మౌనదీక్ష 1951 జనవరిలో ప్రారంభించాను. అంతర్యామిగా కొలువైయున్న ఈశ్వరుడిని నమ్ముకున్నవారికి అన్ని విషయాలు ఆయన అనుగ్రహము వలన సులభసాధ్యం అయిపోతాయి. భౌతిక ప్రపంచంలో జీవించే వ్యక్తికి ఒక్కరోజు మౌనంగా గడపటం కూడా అసాధ్యం అయిపోతుంది. నిరంతరము ఇతరుల సాంగత్యంలో గడిపేవారికి, ఒంటరిగా మౌనంలో గడపటం అంటే అతనికి వెర్రెక్కిపోతుంది లేదా మతిపోతుంది.

అంతరంగ శాంతి, ఉద్దీపనతో పాటుగా నేను మౌనదీక్ష పాటించిన సమయంలో మరొక గొప్ప లబ్ది పొందాను. అనవసర ప్రసంగాలతో, వాదోప వాదాలతో జీవంలేని నిరర్థకమయిన మాటలతో ఎండిపోయిన ఎముకలను నమిలి ఆనందించేవారిలా భౌతిక ప్రపంచంలో మునిగితేలే వ్యక్తుల బారినుండి నా అమూల్య మయిన సమయాన్ని రక్షించుకోగలిగాను. భౌతికమయిన విషయాలన్నింటినుండి దూరమయిన నన్ను వారు నా మానాన నన్ను మౌనంగా ఉండనిచ్చారు. మౌనంగా, ఒక్కమాట కూడా మాట్లాడని నా ముందు కూర్చుని వారి సమయాన్ని వృథా చేసుకోవటం ఎందుకు అని వారు భావించి ఉండవచ్చు. ఆ విధంగా నేను నా మౌనంలో నా అమూల్యమయిన సమయాన్ని గడపటానికి అవకాశం చిక్కింది. భౌతిక ప్రపంచంలో జీవించే వ్యక్తికి అసాధ్యము, అసహజము, అతిక్లిష్టము అనిపించే వన్నీ కూడా ఆధ్యాత్మిక జీవితం గడుపుతూ భగవంతునికి చెందిన వ్యక్తికి చాలా సులభంగా, అత్యంత సహజంగా, సులభసాధ్యంగా అనిపిస్తుంది.

ముందుగా మనము అసలు మౌనము అంటే ఏమిటి? అని తెలుసుకోవాలి. మాట్లాడకుండా ఉండటం మౌనం కాదు. నా గదిలో బల్లపైన ఒక బొమ్మ ఉంది. అది మూడు కోతులు, కళ్ళు, చెవులు, నోరు మూసుకొని ఉంటాయి. దాని అర్థం “చెడు చూడకు, చెడు వినకు, చెడు మాట్లాడకు”. మౌనము అంటే బాహ్యమయిన



పదాలకంటే గాఢమైన అత్యున్నతమైన స్థితి. అందువల్లనే మన ఋషులు మనకు మౌనమే భగవంతుని మాటలుగా వర్ణించారు. “నిశ్శబ్దో బ్రహ్మం” మాటలకి అందనిది బ్రహ్మము. ఎలాంటి కదలికలు లేని నిశ్చలత్వము మనస్సు లోనూ, బాహ్యంలోనూ కూడా ఏర్పడటమే మహోన్నతమయిన స్థితి.

ఋషి మౌనంగా ఉంటాడు. ఎందుకంటే పరమాత్మ తత్త్వము మౌనము కనుక. అదే గొప్ప అద్వితీయము. అందువల్ల ఋషి ఎప్పుడూ మాట్లాడడు. తన మౌనంతోనే శ్రేయస్సు చేకూరుస్తాడు. జీవుడు రక్తమాంసములతో ఒక రూప నామానికి పరిమితమయి ఉండి, ఒకవేళ మౌనం పాటించినప్పటికీ, అంతరంగంలో రకరకాల ఆలోచనలు, ప్రణాళికలు బాహ్య జీవితంలోని కోరికల గురించి రచిస్తూ ఉంటాడు. అలాంటి వ్యక్తి జీవించి ఉన్నా మరణించిన వాడితో సమానమే. ఆరు సుదీర్ఘ సంవత్సరాల మౌనంలో ఆరు రోజుల్లాగా గడిచిపోయినందుకు మౌనాన్ని మించిన మూల్యాన్ని ఏ విధంగా చెల్లించగలను? ఎన్ని సంవత్సరాల కాలమయినా తెలియకుండానే సునాయాసంగా గడిచిపోతుంది. ఎలాంటి అసౌకర్యము, ఇబ్బంది లేకుండా, ఎందుకంటే మౌనము కాలానికి అందనిది, కాలం కంటే అతీతమయింది. మౌనాన్ని జాగ్రత్తగా గమనించి చూడాలి.

ఇప్పుడు మౌనము యొక్క ఆచరణని గురించి తెలుసుకుందాము. మౌనము అన్ని మౌన ఆత్మలను సత్యానికి దగ్గరగా చేరుస్తుంది. మౌనము ఒక్కమాట కూడా అవసరం లేకుండా ఆత్మను సృష్టిస్తుంది. బుద్ధుడు, జీసస్ క్రీస్తు, శ్రీకృష్ణుడు, మహ్మదు ఇంకా ప్రపంచంలోని రక్షకులందరూ కూడా మౌనం యొక్క ఫలితంగా మనకు లభించారు. మాటలతో ఈ ప్రపంచంలో చేయలేని, సాధించలేని కార్యాలను మౌనంతో ఒక్క నిముషంలో సాధించవచ్చును. మౌనము అంటే స్వార్థములేని నిస్వార్థ పరత్వము. మౌనం అంటే ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా ఉండటం కాదు. మౌనం అంటే ఎల్లలు లేని ప్రేమతో అందరినీ ఒక్కటిగా ఏకం చేసే శక్తి.

మౌనము ప్రపంచంలోనే మహోన్నతమయిన స్థితి. అది జీవితాన్ని, వెలుగును, ప్రేమను మాటలతో అవసరం లేకుండా అందిస్తుంది. అన్నింటిని మించి మౌనము అంటే బ్రహ్మ భావన, భగవద్భావన, నిశ్చలత్వము, అది అందరిని కల్పుకుంటుంది. ఏ ఒక్కరిని వదిలిపెట్టదు.

కైలాస ఆశ్రమానికి దర్శనానికి వచ్చే వందలకొద్దీ భక్తులను సేవించటంతో పాటు, ఆరు సంవత్సరాల మౌనదీక్ష వలన పొందిన యథార్థమయిన ఫలితము ఏమిటంటే అది భగవంతుని అనుగ్రహమే. ఇంగ్లీషు, తెలుగులో వెయ్యి సందేశాలు మూడు సంపుటాలుగా "మౌనపుఘడియలు" పేరుతో తయారయ్యాయి.

స్నేహితులారా! మౌనమే మన ఆత్మ స్వరూపము, మన జీవిత గమ్యము. అది నీవు తెలుసుకున్నా లేదా తెలుసుకోలేకపోయినా, మౌనము యొక్క వైభవాన్ని నీవిప్పుడు గుర్తించినా లేదా రేపు గుర్తించినా, అది నీ జన్మహక్కు. ఎందుకంటే నీవుమౌనము నుండే జన్మించావు. ఏమి లేనటువంటి శూన్యమయిన స్థితి, వర్ణించ డానికి వీలుకానటువంటి వైభవము. అతి తొందరలోనే నీవు ఈ సత్యాన్ని తెలుసు కోగలుగుతావు. అప్పుడు నీవు మౌనాన్ని నీ నిత్యజీవితంలో ఆచరించగల్గుతావు.

మౌనాన్ని నేర్చుకోవటం కోసం దయచేసి ప్రయత్నపూర్వకంగా ముందు వారానికి ఒకరోజు మౌనంగా ఉండటం అలవాటు చేసుకోండి. మహాత్మాగాంధీ గారు ప్రతి సోమవారము మౌనాన్ని పాటించేవారు. అది మీకు సాధ్యం కాకపోతే కనీసం నెలకి ఒక్కరోజయినా మౌనాన్ని పాటించండి. అది కూడా మీకు కష్టమనిపిస్తే చివరికి సంవత్సరంలో ఒక్కరోజయినా మౌనాన్ని పాటించండి.

మనలో ప్రతి ఒక్కరూ కూడా జీవితంలో ఏదో ఒక రోజు మౌనం వహించాల్సి వస్తుంది. అది మనము మరణించినప్పుడు. అందువలన మనము జీవించి ఉండగానే మౌనం యొక్క వైభవాన్ని గుర్తించటం అవసరం. వెలుగు ఉండగానే మేల్కోవాలి. వెలుతురు ఉండగానే అన్నీ చక్కబెట్టుకోవడం ఉత్తమం. చీకట్లో తడుము కోవటం వలన అంతా ఆలస్యమయి పోతుంది. మౌనంగా ఉండటం వలన ఎవ్వరూ ఏమీ పోగొట్టుకోరు. పైగా మౌనం వలన ఆంతర్యంలోనూ, బాహ్యంలోనూ ఎంతో లబ్ధి పొందుతారు. మౌనంలో అనంతమయిన శక్తి దాగి ఉంది. ఆద్యంతములు లేని సర్వశక్తిమంతుడు. సర్వవ్యాప్తి, సర్వాంతర్యామి అయిన ఈశ్వరుడికి హృదయము, అతి ముఖ్యమయినది మౌనమే.

ఇక ముగించేముందు నేను చెప్పదల్చుకున్నది ఏమిటంటే మౌనము అంటే ఏమి చేయకపోవటము లేదా సోమరితనము కాదు. నిజానికి మౌనము అత్యంత శక్తిమంతమయినది. నిజమయిన తీవ్రమైన తరంగములు లేని పనిచేసే వ్యాపకము. నిరంతరము మాట్లాడే యంత్రాల వంటి వారికి, పనికిమాలిన ఉబుసుపోక మాటలు మాట్లాడుకునేవారికి అది అర్థం కాదు. ఎవరయితే మానవ జీవిత గమ్యము,



మానవ జన్మహక్కు మర్చిపోతారో వారికి కాలము భారంగా మారుతుంది. ఎవరికి ఆ అగ్నిలాంటి అభిలాష ఉంటుందో వారిలో తీవ్రమయిన వాంఛ ఉపశమించి పోతుంది. మాటలు అపార్థాలు, ఇబ్బందులు కలిగిస్తాయి. శాంతి, సఖ్యతలు ఏ మార్గములో ప్రయత్నము చేసేవారికయినా చివరికి విజయాన్ని చేకూరుస్తాయి.

ఈ ఆరు సంవత్సరాల మౌనదీక్షలో మన ద్రష్టలు, ప్రవక్తలు చెప్పే ప్రబోధము నా హృదయానికి చేరువుగా వచ్చి నాకు ఉత్తేజాన్ని, గొప్ప బలాన్ని చేకూర్చింది. దానిని మీతో పంచుకోవాలనుకుంటున్నాను. "మౌనము సర్వత్ర సాధనమ్" అంటారు. అన్ని ప్రయత్నాలను ఎలాంటి వైఫల్యము లేకుండా మౌనము విజయవంతం చేస్తుంది.

స్నేహితులారా! తెలివయిన వారికి ఒక్క మాట చాలు. అందువలన నా మాటలతో అచంచలమైన నిశ్శబ్దాన్ని ఛేదించదల్చుకోలేదు. కాని మనమందరము ఇప్పుడు మౌనము పాటిద్దాము. మౌనంలోని గొప్పతనాన్ని అవగాహన చేసు కుందాము. శక్తిని, శాంతిని మన ప్రతి జీవకణములోనూ ఇముడ్చుకుందాము.

ఓ మౌనమా! తూర్పు పడమర దేశాల్లోని అశాంతితో అల్లాడిపోతున్న ప్రజలందరిని ఆశీర్వదించు, భావాతీతమయిన నీ వైభవము పట్ల సరయిన అవగాహన లేని మమ్మల్ని ఆశీర్వదించు. దాని వలన మేము మా పనులను, కర్తవ్యాలను, బాధ్యతలను ఎలాంటి వత్తిడులు లేకుండా సక్రమంగా మాటలతో కాలము వృథా చేయకుండా నిర్వర్తించగల్గుతాము. ఈ సృష్టి ప్రారంభము నుండి ప్రపంచానికి వెలుగును, జీవాన్ని, ప్రేమను, ప్రాణాన్ని ప్రసాదిస్తున్న సూర్యభగవానుడు మాటలతో పనిలేకుండా మౌనంగానే తన కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నాడు. మాటలు అనే అజ్ఞాన తిమిరంలోనుండి మౌనము అనే జ్ఞానపథం వైపుగా మనలను నడిపిస్తున్న మౌన గురువు కనిపించే జీవించి ఉన్న గురువు ఆసూర్యుడు. భగవంతుని వాక్కు మౌనము. అది మనలను ఆశీర్వదించుగాక! సత్యాన్వేషకులందరికి అనుగ్రహించుగాక! శాంతి కాముకులందరిని దీవించుగాక! మీ సోదరుడు ఓంకార్ యొక్క ప్రార్థన ఇది.

**ఓం...ఓం...ఓం...**

సూర్యుని మాదిరి నిర్భయత్వంతో, నిరంతర త్యాగగుణంతో ఫలితంకోసం ఆశించకుండా నిష్కామసేవ చేస్తూ, స్వేచ్ఛాప్రేమతో జ్ఞానశక్తులను ప్రసరింపచేస్తూ, బ్రహ్మ తేజంలో విలీనుడై జీవిస్తూ, సర్వవ్యక్తిత్వభావాలకు అతీతుడై, స్వార్థత్యాగియై జీవించడమే విముక్తి మోక్షం.

**–స్వామి రామతీర్థ**

# ఆనంద రామాయణము

(గత సంచిక తరువాయి) **పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద**

తదద్య వాసస్థానం తే మయా జ్ఞాతం మనోరమే ।
పద్మేఽ ధునాఽ హం త్వం ధర్తుం శోధయామ్యనలస్థలమ్॥ 221

ఇత్యుక్త్వా జలకుంభైశ్చ సిషేచాగ్నిం దశాననః ।
యావత్పశ్యతి రక్షాయాం తావత్తత్ర దదర్శ హ॥ 222

పంచ రత్నాని దివ్యాని గృహీత్వా తాని రావణః ।
కరండికాయాం సంస్థాప్య విమానేన యయౌ పురీమ్ ॥ 223

కరండికాం దేవగేహే సంస్థాప్య రావణస్తదా ।
రాత్రౌ మందోదరీం ప్రాహ మంచకస్థాం రహఃస్థితః॥ 224

హే మందోదరి రత్నాని మయా త్వత్తోషదాని హి ।
సమానీతాని యత్నేన త్వదర్థం సురసద్మని ॥ 225

కరండికాయాం వర్తంతే గచ్ఛ గృహ్ణీష్వ తాని హి ।
తద్దశాస్యవచః శ్రుత్వా సా యయౌ దేవమన్దిరమ్ ॥ 226

కరిండికాం తత్ర దృష్ట్వా తాం నేతుం పతిసన్నిధౌ ।
యావదుచ్చాలయామాస న చచాల తదా భువః ॥ 227

తదా సా లజ్జితా గత్వా రావణాయ న్యవేదయేత్ ।
తత్శ్రుత్వా స ప్రహస్యాథ స్వయం నేతుం యయౌ తదా ॥ 228

తాం సోఽ ప్యుచ్చాలయామాస న చచాల కరండికా ।
యదా వింశద్భుజైర్భ్రామ్యా న చచాల కరండికా ॥ 229

తదా స విస్మయావిష్టో భయం మేనే దశాననః ।
తత్రైవోద్ఘాటయామాస రావణస్తం కరండికామ్ ॥ 230

తావద్దదర్శ తస్యాం స కన్యాం సూర్యప్రభోపమామ్ ।
తత్తేజోహరతేజస్కాన్యాసంచక్షూంషి రక్షసామ్ ॥ 231

తాం ద్రష్టుం బాలికాం రమ్యాం యయుః సుహృత్సుతాదయః ।
తదా మందోదరీం ప్రాహ తస్యా వృత్తం రణోద్భవమ్ ॥ 232

పద్మాక్షకులజాత్యాది సర్వం వృత్తం దశాననః ।
క్రోధాన్మందోదరీం ప్రాహ భయభీతా దశాననమ్ ॥ 233



ఇయం కృత్యా ప్రచండా చ కులవిధ్వంసకారిణీ ।
లంకాం కిమర్థమానీతా హ్యస్యా జ్ఞాత్వాఽ పి చేష్టితమ్ ॥ 234

దుష్టాం స్వవంశఘాతాయ త్యజైనాం సత్వరం వనే ।
బాలత్వేఽ పీదృశీ గుర్వీ తారుణ్యే కిం కరిష్యతి ॥ 235

వధోఽ స్యాస్తవ జానేఽ హం మృత్యురేవ భవిష్యతి ।
స్థాపనీయా న లంకాయామియమద్యైవ రావణ ॥ 236

ఇతి తస్యా వచః శ్రుత్వా సత్యం మేనే దశాననః ।
మంత్రిభిశ్చాథ సంమన్త్ర్య దూతానాజ్ఞాపయత్తదా ॥ 237

కరండికేయంనాత్వాఽ ద్య విమానే స్థాప్య యత్నతః ।
త్యక్తవా మమ వాక్యాత్తు వనే గచ్ఛత వేగతః ॥ 238

తతస్తే రాక్షసాః సర్వే సంమీల్య పుష్పకేఽ థ తామ్ ।
కరండికాం తు సంస్థాప్య నిన్యుశ్చాకాశవర్త్మనా ॥ 239

దశాస్యపత్నీ తానాహ కార్యా భూమిగతా త్వియమ్ ।
స్థాపనీయా బహిర్నేయం దర్శనాద్వధకారిణీ ॥ 240

అందుకు రావణుడు, "అగ్నిలో దాగి నీవు మునుపు దేవతలకు, రాజులకు శ్రమనిచ్చితివి. ఓ మనోహారిణీ! నీ స్థలమును నేనెరింగితిని. ఇయ్యగ్ని కుండము నిపుడు శోధించెదను అని చెప్పి, జలకుంభములచే అగ్నిని చల్లార్చి చూచి, అచ్చట దొరికిన దివ్యపంచరత్నములను తీసి, పెట్టెలో పెట్టుకుని లంకకు వెడలి, దేవాలయమున దానిని భద్రపరచి, ఆ రాత్రి మంచముపై మండోదరితో రహస్యముగా, "ప్రేయసీ! నీ కొరకు దివ్యపంచరత్నములను తెచ్చి దేవుని ఇంటిలో పెట్టియున్నాను. (225) ఆ పెట్టెనెత్తికొనిరమ్ము" అని చెప్పెను. అందుకామె అట్లేపోయి ఆ పెట్టెను కదలింపనేరక సిగ్గుపడి, వచ్చి రావణునికి విన్నవించెను. అంత రావణుడే నవ్వుచు వెడలి కదలించి చూచి, రానందున తన యిరువదిచేతులు వ్యర్థములుకాగా, ఆశ్చర్యము పొంది, భయభ్రాంతుడై యచ్చటనే యా పెట్టెను తెరచి చూచెను. అప్పుడందులో సూర్యునివలె వెలుగుచున్న కన్యారత్నమును కనుగొనెను. దాని తేజస్సువలన రాక్షసుల నేత్రములు నిస్తేజస్కములయ్యె. దానిని చూచుటకు బంధుమిత్రవర్గము వారందరు వచ్చి చుట్టుకొనిరి. అపుడు దాని వృత్తాంతము నంతయును రావణుడు మండోదరితో చెప్పెను. అందుకు మండోదరి భయభ్రాంతయై

క్రోధమునొంది, రావణునితో ఇట్లనియె. "ఈ కుమారి నీ కుల నాశనము జేయునట్టిది, దీనివృత్తాంతము తెలిసియును లంకకేల తేబడెను? నిజవంశ నాశనమునకై తెచ్చితివా? వేగమే వనమున వదలుము, బాల్యముననే ఇట్లున్న ఇక యౌవనమున ఏమిచేయగలదో? (240)

**గృహస్థాశ్రమయుక్తో యస్తథా చ విజితేంద్రియః ।**
**వృద్ధిమేష్యతి తద్గేహే కుమారీయం శుభాననా ॥ 241**
**చరాచరేషు సర్వత్ర ఆత్మరూపేణ యః స్థితః ।**
**తస్య గేహే చిరం కాలం స్థాస్యతీయం న సంశయః ॥ 242**
**ఇతి మందోదరీవాక్యం శ్రుత్వా దూతాః సవిస్తరమ్ ।**
**యావత్తే గంతుముద్యుక్తా స్తావత్కన్యా వచోఽబ్రవీత్ ॥ 243**
**యస్యామ్యహం పునర్లంకాం రాక్షసానాం వధాయ చ ।**
**నిధనాయ దశాస్యస్య సపుత్రస్య సమంత్రిణః ॥ 244**
**అథ తృతీయవేళాయాం ఆగత్యాహం పునస్త్విహ ।**
**నికుంభజం పౌండ్రకం తం శతశీర్షం చ రావణః ॥ 245**
**హనిష్యామి పునర్గత్వా పునర్యాస్యామి త్వత్పురీమ్ ।**
**అహం చతుర్థవేళాయామద్భుతం మూలకాసురమ్ ॥ 246**
**కుంభకర్ణసుతం శూరం మర్దయిష్యామ్యహం పునః ।**
**తత్తస్యా వచనం శ్రుత్వా హృది విద్ధో దశాననః ॥ 247**
**జాతాస్తే రాక్షసాః సర్వే భయభీతాః శవోపమాః ।**
**రావణశ్చింతయామాస హంతవ్యాఽద్యైవ బాలికా ॥ 248**
**తీక్ష్ణం ఖడ్గం కరే ధృత్వా పద్మాం దుద్రావ రావణః ।**
**హేతుకామం పతిం దృష్ట్వా మయకన్యా న్యవారయత్ ॥ 249**
**సాహసం కురు మాఽద్యైవ సత్యాయుషి దశానన।**
**భవిష్యతి వధస్త్వద్య తవ నాస్యా వచోమృషా ॥ 250**

నీకు దీనివల్లనే మృత్యువు సంభవించును. నేనేఱుగుదును, ఇప్పుడే దీనిని లంకలో ఉంచవలదు" అని ఇట్లు చెప్పిన మండోదరీ వాక్యములను విని, సత్యమని నమ్మి, మంత్రులతో ఆలోచించి దూతలతో, "ఈ పెట్టెనెత్తి విమానమున పెట్టుకొని వనమునకు పోయి, వేగమే విడువదగును" అని ఆజ్ఞాపించెను. (250)



# గురువాచక కోవై

**మూలం : మురుగనార్** **వివరణ : సాయికృష్ణ**

(గత సంచిక తరువాయి) **దుఃఖనివృత్తి**

**జీవుడు జన్మదుఃఖమునందు చిక్కితి ననెడి భ్రాంతితో మనోవ్యధకు లోనై తీవ్ర అసంతృప్తి కారణముగా క్రుంగిపోవుచుండును. 'నేను' అనెడి అహంత నశించగా, అతడు (జీవుడు) తన సత్‌స్వరూపము పరమానుగ్రహ రూపమున నుండెడి బ్రహ్మ స్వరూపమని అనుభవగోచరము కావించుకొనవలెను. అతనిని పాలించెడి ఉన్నతశక్తి అదే. జీవుడు తన మనోవ్యధను అంతముజేసికొని, పరమానందమును అనుభవించుటకు ఇదే ఏకైక మార్గమగు మార్గము.**

జీవుడు తనకు దుఃఖము కలుగుతున్నదని అనుకుంటూ ఉంటాడు. ఈ దుఃఖము సహజమయినది కాదు, మధ్యలో వచ్చినదని విచారణ ద్వారా తెలుసుకోవాలి. ఈ జన్మపరంపరలో చిక్కి దుఃఖాన్ని అనుభవించుట అనేది భ్రాంతి మాత్రమే. అది నీ నిజస్వరూపము కాదు. మన నిజస్వరూపము తెలుసుకోవాలంటే మనల్ని మనము బాగుగా విచారణ చేయాలి. ఇది గుర్వనుగ్రహము ద్వారానే కలుగుతుంది. గుర్వనుగ్రహము లేకుండా నేర్చుకున్న విద్య గుడ్డి విద్యని మహాత్ములు అంటారు. ఒకదానిమీద గురి కుదరడమే గురువు. దేనిమీద గురి కుదురుతుందో దానిని శ్రద్ధావిశ్వాసాలతో ఆరాధిస్తే ఫలితం కలుగుతుంది. దత్తాత్రేయుడు తను చూసిన ఇరవైనాలుగు తత్త్వాలనుండి ఒక్కొక్క విషయం నేర్చుకున్నాడు. మనకు తెలియని విషయములను మనకు తెలియజేసే వారందరూ గురువులే. దుఃఖనివృత్తి కావడానికి మనకు గురువు అవసరం. శాస్త్రములు, గ్రంథములు ద్వారా, మానవగురువుల ద్వారా, పంచభూతాలు, ప్రకృతి ద్వారా మనము విషయాలను గ్రహించి దుఃఖాన్ని పోగొట్టుకోవాలి. గురువు అనేవారు అవసరం. దుఃఖమునకు కారణము, ఆ కారణము ఎలాపోతుందో తెలుసుకొని సాధనచేయాలి. గురుబోధవలన దుఃఖము అనేది భ్రాంతి అని తెలుస్తుంది. మనస్సు శరీరముతో ఏకమై, శరీరమే తానని మనుష్యుడు బాధలు పడుతున్నాడు. నిజానికి అతడు ఆత్మస్వరూపుడు. తాను శరీరము అనుకోవడము భ్రాంతి, అజ్ఞానము. ఏదో ఒకరకముగా భ్రాంతి నుండి బయటపడి మన దుఃఖమునకు నివారణము తెలుసుకుంటాము. మన స్వరూపము బ్రహ్మస్వరూపమని, సచ్చిదానంద స్వరూపమని, జ్ఞానస్వరూపమని అనుభూతిని పొందుతాము. భగవంతునికి శరణాగతి చెందకుండ ఆధ్యాత్మిక మార్గంలో ఒక అడుగు కూడ

ముందుకు వేయలేము. భక్తి, సాధన, జ్ఞానము, గుర్వనుగ్రహము, భగవంతుని అనుగ్రహము వలన మన వ్యథను అంతము చేసుకోవాలి. పరమానందము అనుభవించేవానికి ఇదంతా భ్రాంతి అని తెలుస్తుంది. మనకు భ్రాంతి తొలగక ముందు, తొలగిన తరువాత కూడ ఇది రక్తమాంసములతో కూడిన శరీరము అనే విషయము తెలిసినప్పుడు భ్రాంతి చెందడం మానుతాము. వేదాంతము ఏ విషయమును కొత్తగా ఏమీ చెప్పదు. ఉన్న విషయమునే మాటిమాటికి చెబుతుంది. గురువు ఉన్న విషయము యొక్క వెనకాల ఉన్న సత్యాన్ని చెప్పి మన భ్రాంతిని తొలగిస్తారు.

**నీవు తత్త్వమును (ఆత్మను) సాక్షాత్కరింప జేసుకోవలయును. ఆత్మను విస్మరించిన యెడల ఈ జగన్మాయ శక్తివంతమయి, భ్రాంతికారకమయి, నిన్ను మోహబద్ధుని చేయును. కనుక ఆత్మను తెలిసికొనని యెడల సంపూర్ణ దుఃఖనివృత్తికి లేశమాత్రమయినను అవకాశము లేదు.**

నీవు ఆత్మానుభవము పొందితేనే సంపూర్ణ దుఃఖనివృత్తి జరుగుతుంది. తాత్కాలిక ఉపశమనము వలన దుఃఖము పూర్తిగా పోదు. నిన్ను నీవు విచారణ చేసుకొని, గురుబోధ చేత ఆత్మానుభవము పొందితే తప్ప ఈ దుఃఖము శాశ్వతముగా నివృత్తి కాదు. దుఃఖమునకు కారణమయిన అజ్ఞానాన్ని నశింపచేసుకొని దుఃఖ నివృత్తిని పొందాలి.

**దారాపుత్రాదుల మరణము కారణముగా దుఃఖతప్తుడై విలపించెడి వ్యక్తి, మొదట తనలో తాను విచారణ చేసి, తన యొక్క సత్యస్థితి ఏమిటో యెఱిగి స్వస్వరూపమును సిద్ధింపజేసికొనవలయును. దీనిని సాధించిన తరువాత, ఆత్మ విచారణ ఫలముగా నశించిన దేహాహంత యొక్క మరణమును గూర్చి విలపించినచో, అతని తొలుతటి విలాపమునకు కారణమైన మనోవ్యథ యావత్తు పూర్తిగా నశించిపోవును.**

భార్య, బిడ్డ, సమీపబంధువుల మరణము ద్వారా బాధ కలుగుతుంది. గురువు ఇది సహజమని, నీకు కూడ మరణము సంభవిస్తుందని చెబుతారు. తన చనిపోయిన బిడ్డను బ్రతికించమనిన తల్లితో, మరణములేని ఇంటినుండి నువ్వులు తీసుకురమ్మని బుద్ధుడు చెబుతాడు. ప్రతి ఇంట మరణము సహజమేనని ఆవిడ తెలుసుకుంటుంది. పుట్టినవారు మరణించడము సహజమని, దానికి దుఃఖపడకూడదని బుద్ధుడు ఆ తల్లికి బోధచేసి జ్ఞానోదయం చేస్తాడు. మనము మన అజ్ఞానములో వాస్తవాన్ని



గ్రహించము, గురువులు భ్రమను తొలగించి అసలు వాస్తవాన్ని చెబుతారు. గురు బోధతో తన సత్యస్థితిని తెలుసుకొని, తనలో తాను విచారణ చేసుకొంటే ఆత్మ విచారణ ఫలితముగా దేహభ్రాంతి పోతుంది. అప్పుడు దుఃఖము తొలగిపోతుంది. నేను ఆత్మస్వరూపుడను, సచ్చిదానంద స్వరూపుడుననే విషయం మరచిపోవడము వలనదుఃఖము కలుగుతుంది. ఈ మరచిపోయిన విషయమును గురువులు, శాస్త్రాలు గుర్తు చేస్తున్నాయి. తప్ప కొత్తగా ఏ విషయమూ చెప్పడము లేదు. ఎప్పుడయితే అహంకారము నశిస్తుందో దుఃఖము నశించి హాయిగా ఆనందముగా ఉంటావు.

**ప్రశ్న:–** మనము ప్రేమించిన వ్యక్తి మరణించినచో దుఃఖము కలుగును. అందరిని ఒకే విధముగా ప్రేమించుట ద్వారాగాని, అసలు ఎవరిని ప్రేమించకుండ ఉండుట ద్వారాగాని అట్టి దుఃఖమును మేము తొలగించుకొనగలమా? దుఃఖించెడిది అహము. అహంకారమును నాశనము చేసిన దుఃఖపడు వారెవ్వరు ఉండరు. ఈ శరీరభ్రాంతిని వదలినప్పుడే హాయిగా, ఆనందముగా ఉందుము.

**శరీరస్థుడైయున్న ఒక వ్యక్తిగా భావించి, నీవు ఒక జీవుని ప్రేమించినచో, ఆ వ్యక్తి మరణించినప్పుడు దుఃఖము తప్పక కలుగును. ఈ దుఃఖము పూర్తిగా నశించి పోవలయునన్నచో, దుఃఖరహితమగు సత్యప్రేమను నిరంతరము అభ్యసింపుము. దానికై జీవుని సత్‌స్వరూపము ఆత్మయే అని యెఱిగి, ఆత్మ స్వరూపముగానే ఆ జీవుని చూడుము, ప్రేమించుము.**

మన సన్నిహితులు పోయినపుడు వారితో మన అనుబంధము తలచుకొని చాలా బాధపడతాము. మనకు మనము ఈ శరీరమే అనెడి భ్రాంతి వలన ఈ దుఃఖము కలుగుతుంది. భగవాన్ ఇలా అంటున్నారు. ఈ జీవులను శరీరాలుగా చూడవద్దు. వారిని ఆత్మస్వరూపులుగా చూడు. ఆత్మకు చావు పుట్టుకలు లేవు. ఒక రూపం వచ్చింది, పోయింది, ఇటువంటి భావన చేస్తే దుఃఖము ఉండదు. ముందుగా మనకి మనము ఈ శరీరము కాము అనే భావన చేస్తే, అందరిని ఆత్మస్వరూపులుగా చూడగలము. ముందు మనకు, ఈ దేహము నేను కాదు, నేను ఆత్మను అనే దృఢమయిన నిశ్చయమే కాకుండ అనుభవం కూడా కలగాలి. ఈ దృఢనిశ్చయం కలిగితే ఏ వ్యక్తులు దూరమయినా, దగ్గరయినా, ఏ సంఘటన అయినా మనలను బాధించదు. మనము ప్రశాంతముగా ఉండగలము. ప్రతీజీవిని వ్యక్తులుగా కాకుండ ఆత్మస్వరూపులుగా చూడాలి.

**హరిః ఓం తత్సత్**

## దక్షిణామూర్తి స్తోత్రం

# మానసోల్లాసం -8

**(నవంబరు సంచిక తరువాయి)** **వాఖ్యాత – వింజమూరి రాధాకృష్ణ**

శంకర భగవత్పాదులు వ్రాసిన దక్షిణామూర్తి స్తోత్రం భారతీయ తత్వ విచారణలో గణనీయమైనది. కేవలం పదిశ్లోకాలలో భారతీయ తత్వాన్ని అంతనీ అద్వైత కోణంలో శంకరులు ప్రకాశింపచేశారు. దీనిని భావగర్భితంగా, అందరూ అర్థం చేసుకోవడానికి వీలుగా వారి తరువాత శారదా పీఠాన్ని అలంకరించిన వారి ప్రథమ శిష్యులు శ్రీ సురేశ్వరాచార్యులు 300 శ్లోకాలలో మానసోల్లాసం పేరున వ్రాసిన వార్తిక మే 1924 నెల శాంతి పత్రికనుండి ధారావాహికంగా నవంబరు నెల వరకు పాఠకులకు అందించబడింది.

దీనిలో భాగంగా దక్షిణామూర్తి స్తోత్రంలోని మొదటి శ్లోకానికి సురేశ్వరా చార్యులు 30 శ్లోకాలలో విశ్లేషణ చేశారు. నవంబరు సంచికతో ఇది పూర్తి అయినది. సప్తభాగాలుగా శాంతిపత్రికలో ఇంతవరకు ఈయబడిన ఈ అద్వైత అమృతాన్ని ఒక్కసారి క్లుప్తంగా సింహావలోకనం చేయడం అవసరం. ఈ సదుద్దేశంతో ఈ మాసం పత్రికలో ఈ సారాన్ని అందించే ప్రయత్నం చేయబడింది.

దక్షిణామూర్తి స్తోత్రం లోని మొదటి శ్లోకం ఇలాఉంది.

**విశ్వం దర్పణ దృశ్యమాన నగరీ తుల్యం నిజాంతర్గతం నమ**
**పస్యాన్నాత్మని మాయ యా బహిరివోద్భూతం యధా నిద్రయా**
**య సాక్షాత్కురుతే ప్రబోధ సమయే స్వాత్మాన మేవాద్వయం**
**తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తియే**

మన నిజజీవిత అనుభవంలో సాధారణంగా మనకి తోచేది 1. నేను (అహం) 2.ఆ నేను కాని, నాకన్నా వేరుగా ఉండి,. నేను చూస్తున్న, అనుభవిస్తున్న నా చుట్టూ ఉన్న విశ్వం (ఇదం) అనే జైవిక భౌతిక ప్రకృతి 3.(నేను కాదు కావున) దాని సృష్టికర్త ఎవరో తెలియని (బ్రహ్మ పదార్థం లేక (తత్) భావము. ఇలా మూడు అంశాలు కలిగిన త్రిపుటి మనందరి సాధారణ నిత్యానుభవం. వీటిని తెలుసుకోవడం లోనూ వాని మధ్యగల సంబంధాన్ని స్పష్టంగా వివరించడంలోనూ భారతీయ తత్వ శాస్త్రాన్ని మించినది లేదు అనుట అతిశయోక్తి కాదు. ఆ తత్వాన్ని అంతనీ శంకరులు ఈ ఒక్కశ్లోకంలో పొందుపరిచారు. సురేశ్వరాచార్యుల వారు ఈ శ్లోకం ఒక్కదానికి వ్రాసిన 30 శ్లోకాల వార్తిక ఈ అంశాన్ని దృఢపరుచుచున్నది.

ప్రార్థన అనంతరం నాలుగవ శ్లోకము నుండి ఈ విశ్లేషణ ప్రారంభం



అయ్యింది. ఈ విశ్వంలో మనము చూచే ఒక వస్తువు ఒకటి ఉన్నది అనుకుందాం (అస్తి) అది కనబడుతుంది కావున ప్రకాశిస్తోంది (భాతి) అయితే ఆ వస్తువు ఫలానా వస్తువు అంటే అది పుస్తకము లేక బిందె అని గుర్తించే జ్ఞానం ఎచ్చట గలదు ఆ వస్తువును చూపించుచున్న దృశ్యములోన లేక దానిని చూస్తున్న ద్రష్టలోన అనే అన్వేషణతో చర్చ ప్రారంభమైనది. ఇప్పుడు ఆ జ్ఞానాన్ని ఇచ్చే సాధనం ఆత్మయేనా అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఇందుకు సహాయకారిగా మాండూక్య ఉపనిషత్‌లో పేర్కొన్న తేజస్వుడు ఉదాహరణగా గైకొనబడినది.

స్వప్నము నుండి మేలుకొనగానే ఒక వ్యక్తికి అంతవరకు తనకు కలలో బయట ఉన్నట్లు కనిపించిన వస్తుసముదాయము, కలలో జరిగిన సంఘటనలు ఏవి బయటలేవనీ, అంతా తనలోనే జరిగినదని తెలుసుకుంటాడు. ఆ కలలో అతడు కూడా ఒక పాత్ర అయి ఉంటే అతడు తనని తానే చూచుకున్నాడు. అట్లే ఈ విశ్వం అద్దంలో కనిపించే ఒక నగరము యొక్క ప్రతిబింబముగా చెప్పబడింది. అతి ప్రతిబింబం అయితే "దాని అసలు మూలము ఎక్కడ ఉంది?" అనే ప్రశ్న ఉదయిస్తుంది. దీనికి జవాబుగా శంకరులు **"నిజాంతర్గతం", "యథానిద్రయా" అని మాండూక్య ఉపనిషత్ ఆధారముగా రెండుమాటల్లో తేల్చిచెప్పారు.** ఈ భాసించే నామరూపాలకు స్వతంత్రత లేదు అవి సత్తా కూడా కాదు. మాయ లేక అజ్ఞానం వల్ల అవి బయట ఉన్నట్లు కనిపించుచున్నవి. ప్రతిబింబిస్తున్న నగర రూపం అద్దము కన్నా భిన్నము కాదు దానిని అద్దము నుండి వేరు కూడా చెయ్యలేము.

స్వప్నంలో పొందే ఈ అనుభూతిని మెలకువగా ఉన్నప్పుడు నిజజీవితంలో చేసే కార్యకలాపాలతో అన్వయించి ఈ జాగ్రదావస్తలో ఉన్న వ్యక్తి విశ్వానరుడి పాత్ర ధరిస్తున్నాడు. కర్మేంద్రియాలు పంచేంద్రియాలు సూక్ష్మ శరీరం పొందే అనుభవాలు సత్యమని భ్రాంతి చెందుతున్నాడు. ఇందుకే శంకరులు **బ్రహ్మసత్యం జగత్ మిధ్య** అన్నారు. కంటికి స్పష్టంగా కనిపిస్తున్నది మిధ్య అని అజ్ఞానముచే మానవుడు అంగీకరించలేదు. వినోబాభావే బ్రహ్మసత్యం జగత్స్ఫూర్తి అన్నారు. అంటే కలలో తేజస్వుడిగా వ్యక్తి తనలో ఉన్న దానిని బయట ఉన్నట్లు తామసనిద్ర ప్రభావం వలన ఎట్లు భావిస్తున్నాడో అట్లే మెలకువగా ఉన్నప్పుడు విశ్వానరుడిగా అజ్ఞానము లేక మాయ చే (ఆత్మలో) ఉన్నదానినే బయట ఉన్నట్లు భావిస్తున్నాడు లేక భ్రమిస్తున్నాడు. అయితే జ్ఞానస్వరూపుడైన గురుమూర్తి దయచే **యసాక్షాత్కు రుతే ప్రబోధ సమయే స్వాత్వాన మే వాద్వయం** అని అజ్ఞానము తొలగి జ్ఞానోదయం కాగానే తానుఒక్కడే ఆత్మగా ఉన్నానని తెలుసుకుంటాడు. చాందోగ్య ఉపనిషత్‌లోని 6-2-1 మంత్రము చెప్పిన ఏకమేవా ద్వితీయం వలన పరిఛేస్ దముచ్ఛేదము

లేక త్రిపుటి నశించి భగవాన్ రమణమహర్షి ఉపదేశ సారం 27వ శ్లోకంలో పేర్కొన్నట్లు

**జ్ఞానవర్జిత ఉ జ్ఞాన హీన చిత్**

**జ్ఞానమస్తికిం జ్ఞాతుమంతరం** స్థితిని పొందును. అనగా జ్ఞానము–అజ్ఞానము రెండింటిని దాటిన జ్ఞానమే నిజమైన జ్ఞానం. సమస్తమునకు అతీతమై సర్వాత్మకమై వలయు జ్ఞానమును తెలుసుకొనుటకు వేరు వస్తువు ఏమున్నది. సూర్యుని చూచుటకు దీపమవసరమా!

అనగా సుషుప్తి లేక గాఢనిద్రలో ఎట్టి అనుభవము లేక హాయిగా ఉన్నాడో అతడే నిద్రలో కలకనేటప్పుడు తనతో సహా తనలోనే ఉన్న జగత్తును బయట ఉన్నట్లు భావించును. మెలకువరాగానే తనలోనే ఉన్న జగత్తును బయట ఉన్నట్టు భ్రమించును. ఈ రీతిగా దక్షిణామూర్తి స్తోత్రం లోని మొదటి శ్లోకములోనే అద్వైత భావానికి పునాదివేసి రెండవ శ్లోకములో ఈ సృష్టిలేక విశ్వం ఎలా ఏర్పడినది అను అంశము వివరింపబడినది.

**బీజాస్యాంతరివాంకురో జగదిదం ప్రాక్ నిర్వికల్పం పునః**
**మాయా కల్పిత దేశకాల కలనా వైచిత్ర్య చిత్రీకృతం**
**మాయావీవ విజృంభయ త్యపి మహాయోగీ వ య స్వేచ్ఛయా**
**తస్మై శ్రీ గురుమూర్తయే నమమిదం శ్రీదక్షిణామూర్తయే**

బీజస్య అంతః=విత్తనము లోపలి, అంకురఃఇవ=మొలకవలె, ఇదం జగత్= ఈ ప్రపంచము, ప్రాక్=మునుపు, నిర్వికల్పః=ఎట్టి తేడాలు లేని ఒక్కటిగా ఉండేది. అనగా వికల్పరహితమై ఆత్మగా మాత్రమే ఉండెను, పునః=మరలా తిరిగి, మాయ కల్పిత = మాయచే కల్పించబడిన, దేశ కాల కలనా=స్థలము, కాలముల కార్యం వల్ల, వైచిత్ర్య= వివిధ రకములగు, చిత్రీకృతం=కల్పించబడినది లేక రచింపబడినది. యః =ఎవరైతే, మాయావీ ఇవ=మాంత్రికుని వలె, మహాయోగి ఇవ=ఒక గొప్ప మహాయోగి వలె, యః=ఎవరు, స్వేచ్ఛయా అపి=తన ఇచ్ఛతో తనకు తోచిన రీతిలో మాత్రమే, విజృంభయతి = ఈ ప్రపంచంలో విస్తరించుచున్నాడో తస్మై=అట్టి, శ్రీ గురుమూర్తి యే= గురురూపికి, శ్రీ దక్షిణామూర్తియే=శ్రీ దక్షిణామూర్తికి, ఇదం నమః=ఈ నమస్కారము.

సృష్టికి ముందు ఈ విశ్వమంతా ఎట్టి భేదములు లేని నిర్వికల్ప స్థితిలో విత్తనములో దాచబడిన మొలక లేక మహావృక్షంవలె ఉన్నది. ఒక మహా మాంత్రికుడు లేక మహాయోగి తన మాయచే స్వేచ్ఛతో తన ఇచ్ఛను అనుసరించి విస్తరింప చేసెనో అట్టి గురుమూర్తి స్వరూపుడైన శ్రీ దక్షిణామూర్తికి నమస్కారము.

**ఓం...ఓం...ఓం**



# భయం

**యన్.వి. శాంతిరెడ్డి**

భయం మనస్సు యొక్క ఉత్పత్తి. భయపడేకొద్దీ పెరిగిపోతుంది. దానిని గమనించడం ప్రారంభిస్తే అది తోక ముడుస్తుంది. **– స్వామి తత్త్వవిదానంద**

అప్పుడు మా అన్నయ్య డిగ్రీ నేను ఇంటర్ చదువుతున్నాం. ఆరోజు శివరాత్రి. మా నాన్నగారు మావూరి శివాలయం పూజారి. అర్ధరాత్రి లింగోద్భవం వరకూ అన్ని కార్యక్రమాలు పూర్తి అయ్యాయి. అందరం ఇంటికొచ్చాం. నాన్నగారికి హార్ట్ఎటాక్. శ్రీధర్‌మామ నాన్నగారిని ఆసుపత్రికి తీసుకెళ్ళారు. లాభంలేదు. శివునిలో ఐక్యం అయ్యారు. దహనసంస్కారాలు పూర్తయ్యాయి. అన్నయ్య తలకొరివి పెట్టాడు. పుట్టెడు దుఃఖంలో వున్న మా అమ్మగారు మాతో "మహానుభావులు మీ తండ్రి. పర్వదినాన శివునిలో లీనమయ్యారు. కోటికి ఒక్కరు కూడా పొందలేనిగతి. అలాంటి వారికి కూడా తీరనికోరిక ఒకటుంది. ఒక్కసారైనా హరిద్వార్, ఋషికేష్ యాత్ర చేయాలని. తీరకుండానే తనువు చాలించారు. వారి అస్థికలైనా గంగలో నిమజ్జనం చేస్తే మీరు పితృఋణం తీర్చుకున్నట్లు అవుతుంది. కానీ... మీరు మనవూరు దాటి ఎక్కడికీ ప్రయాణం చేయలేదు, ఎలా?"

"నాన్నగారి ఆకాంక్ష నేను నెరవేర్చుతానమ్మా? ఋషికేశ్ వెళ్ళి గంగమ్మలో అస్థికలు నిమజ్జనం చేస్తాను". అన్నాను నా ధైర్యానికి నాకే ఆశ్చర్యం వేసింది!

విషయం తెలిసిన శ్రీధర్‌మామ బెజవాడ వరకూ సింహాద్రి, అక్కడ నుండి హరిద్వార్‌కు డెహరాడూన్ సూపర్‌ఫాస్ట్‌లోనూ, మళ్ళీ ద్వాదశకర్మ నాటికి తిరుగు ప్రయాణానికి రిటర్న్ టికెట్స్ కూడా రిజర్వ్ చేశాడు.

మూడోరోజు చిన్నకర్మ సందర్భంగా అస్థికలు 'సంచయనం' చేసి, ఆ కలశాన్ని బాగ్‌లో పెట్టుకొని రెడీగా వున్నాను. శ్రీధర్‌మామ నా బట్టలబ్యాగ్ తీసుకొని తన లాంబ్రెట్టా స్కూటర్ వేసుకొనివచ్చి, నన్ను ఎక్కించుకొని రాజమండ్రి రైల్వేస్టేషన్‌కు తీసుకొచ్చి సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఎక్కిస్తూ "జాగ్రత్తరా అల్లుడూ! రైల్వేస్టేషన్‌లలో, రైల్లో కూడా జేబుదొంగలుంటారు. ప్రయాణంలో ఎవరినీ అంటే నీసహ ప్రయాణీకులను కూడా నమ్మొద్దు! ఎవరేమి పెట్టినా తినవద్దు!" అంటూ అనేక జాగ్రత్తలు చెప్పాడు. అప్పటివరకూ భయం అంటే ఏమిటో తెలియని నాకు 'దొంగ' భయం పెట్టాడు మావయ్య!!

ట్రైన్‌లో కూర్చున్నానే గాని సెనక్కాయలు అమ్ముకొనే ముసలమ్మ దగ్గర్నుంచి భిక్షమెత్తుకొనే మామ్మ వరకూ...అంతెందుకు టికెట్ చెకింగ్ చేసేవారు, అప్పుడప్పుడు వచ్చే పోలీస్ వరకూ.. అందరూ దొంగల్లాగే కనిపిస్తున్నారు. డబ్బులున్న నా పాంట్ సీక్రెట్ పాకట్ అప్పుడప్పుడు తాకి చెక్ చేసుకుంటున్నాను.

విజయవాడ స్టేషన్‌లో దిగి పదోనెంబరు ప్లాట్‌ఫారమ్‌కు వెళ్ళి ఒక చోట కూర్చున్నాను. ఆ ప్లాట్‌ఫారమ్ మీద తిరుగుతున్న వారందరూ నాకు దొంగల్లా తోస్తున్నారు. నాలాంటి మామూలు మనిషి ఒక్కడూ కనిపించలేదు. పావు తక్కువ ఐదుగంటలకు మధురై-డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్ వచ్చింది. అందులోనూ అందరూ దొంగల్లాగే కనిపిస్తున్నారు. నా బోగీలో ముగ్గురు సన్యాసులు కూడా వున్నారు. వాళ్ళు ముగ్గురూ అందరికంటె పెద్దదొంగల్లా కనిపిస్తున్నారు. బవిరిగడ్డాలు, మీసాలతో! నాకర్మకొద్దీ నా ఎదుటిబర్త్ మీద ఒక పెద్దసన్యాసి, తమిళం, ఇంగ్లీషుల్లో తెగ మాట్లాడుతున్నాడు! అతని సంచీలో కత్తిగానీ పిస్తోలుగానీ వుండే వుంటుంది. అతను నన్నే గుచ్చిగుచ్చి చూస్తున్నాడు. నేను నాలోనికి కుచించుకుపోతున్నాను భయంతో!

నాకు తెలీని భాషలో మాట్లాడేస్తున్న సడన్‌గా తెలుగులో “బాబూ ఎక్కడిదాకా ప్రయాణం?” అడిగాడు.

“ఋషికేశ్” చెప్పాను.

“వంటరిగా వెళ్తున్నావేం? భయంగాలేదా” అడిగాడు. ఇంటిలోంచి పారిపోయి వచ్చిన బాపతుగా భావించి వుంటాడు.

“మానాన్నగారు శివాలయంలో పూజారి. శివరాత్రి రోజున శివసాన్నిధ్యం పొందారు. వారి అస్థికలు గంగలో నిమజ్జనం చేయాలని మా అమ్మగారి ఆశయం. మా అన్నయ్య ఇంటిదగ్గర కర్మలు చూసుకుంటున్నాడు. నేను ఒంటరిగా బయలు దేరాను. మా మావయ్య చెప్పినట్లు రైల్వేస్టేషన్‌లో, ట్రైన్‌లో అందరూ దొంగలే కనిపిస్తున్నారు అందరిలోనూ మీరు దొంగలనాయకుడిలా కనిపిస్తున్నారు.” చెప్పాను.

ఆ సన్యాసి అదోలా నవ్వాడు. ఎందుకో ఆ నవ్వు నాకు చాలా నచ్చింది!

“చూడూ! నేనూ.. స్వామి బ్రహ్మవిద్యానంద సరస్వతి. ఋషికేశ్ ఆర్ష విద్యాపీఠంలో వేదాంతశాస్త్రం బోధిస్తాను. నన్ను ఒక ఆత్మీయుడుగా భావించు. అప్పుడునాలో కనిపిస్తున్న దొంగ మాయమైపోతాడు. దొంగ అంటే భయం



ఉన్నవాడికి అందరూ దొంగల్లా, దెయ్యం అంటే భయం ఉన్నవాడికి అన్నీ దెయ్యాల్లా, పాము అంటే భయమున్న వాడికి అన్నీ పాముల్లా కనిపిస్తాయి. భవిష్యత్తు అంటే రేపటిగురించి ఆలోచిస్తే భయమే కలుగుతుంది. తాడులో పామును చూస్తే అన్యదాగ్రహణం భయమే మరి! నీ భయం నీ మనస్సు యొక్క ఉత్పత్తి నీకంటే అన్యంగా ఏదో వుందనే భావనే భయం! నీ మనస్సు చెప్పింది సత్యమని చెప్పడానికి ప్రమాణం లేదు. గుణదోషములు వస్తువులలోనో, నీ ఎదుటి నామరూపాల్లోనో లేవు. నామరూపాలు చూడడం మానేసి వాటి తత్వాలను చూడాలి! మనస్సును చంపేయకూడదు. దాన్ని నీవు ఉపయోగించుకోవాలి! మనస్సు నిన్ను ఉపయోగించు కున్నప్పుడే ఈ భయాలు అసలు నీవు తప్ప రెండోదిలేదు. నీవు చూస్తున్నవి, వింటున్నవి, భావన చేస్తున్నవి అన్నీ నీ లోపలే వున్నాయి. నీలోపల వున్న వాటినే బయట నీవు చూస్తున్నావు. నీ మనసును నీవు గమనించు, అలాగమనిస్తూ వుంటే ఈనామరూపాలు ‘మాయ’ అని తెలుస్తుంది. భయాలన్నీ తొలగిపోతాయి!”

రాత్రి పదిగంటలు కావొస్తోంది. రైలు రామగుండంలో ఆగింది. స్వామీజీ రైలుదిగి రెండుపొట్లాలు ఇడ్లీలు తెచ్చి ఒకటి నాకిచ్చి “అనుమానాలేమీ పెట్టుకోకుండ ఇవి తిని ప్రశాంతంగా నిద్రపో! ఋషికేశ్‌లో నీ పనులన్నీ నేను పురమాయించి నిన్ను తిరిగి హరిద్వార్‌లో రైలు ఎక్కించే ఏర్పాటు నేను చేస్తాను.” అన్నారు స్వామీజీ.

నాకు చాలా ప్రశాంతంగా బావుంది. మా నాన్నగారు నేర్పించిన శ్లోకం గుర్తొచ్చింది. “అజ్ఞానతిమిరాంధస్య జ్ఞానాంజనశలాకయా! చక్షురున్మీలితం యేన తస్మై శ్రీ గురవే నమః!!

నిరంతర గాఢమైన ధ్యానము ద్వారా విసుగు, విరామము లేని అనంతమైన ప్రశాంతతను సాధించవచ్చును. అదే చివరకు సమస్తమును చొచ్చుకొని పోగల తీవ్రకాంతి రూపంలో సమస్త భౌతిక పదార్థముల నుండి దూసుకొనిపోయి సర్వత్ర ప్రకాశించు ఆ పరమాత్మను జేరును. విశ్వచైతన్యము అనగా పరమాత్మతో ఏకత్వమగు సాధించగోరు యోగి తన మనసును యోగసాధన ద్వారా పొందిన అంతర్దృష్టి యందు నిశ్చలముగా నిలకడగా నిలపగలిగి ఉండాలి. తన మనస్సును ప్రథమ దశలలోని అధిచేతనాస్థలో కలుగు అశాంతికి లోనుగానీయక జాగ్రత్త పడాలి. అట్టి యోగి తన నిశ్చల, ప్రశాంత హృదయ సింహాసనమును పరమాత్ముని విశ్రాంతి మందిరముగా తెలుసుకొని అనందపడతాడు.

**-శ్రీపరమహంస యోగానంద**

# వాక్‌శుద్ధి

**-స్వామి ఓంకార్**

వాక్‌శుద్ధి గల్గినవారు సత్యవంతులు. వారే మహాత్ములు, అవతార మూర్తులని చెప్పవలెను. వారు ఏ మాట అన్నను జరిగితీరును. జరిగెడి మాటలేవారు వచించు చుందురు. ప్రకృతి విరుద్ధమైన, విపరీతమైన జరగని మాటలు వారి నోటినుండి యెన్నడును రాజాలవు.

వాక్‌శుద్ధి గల్గియుండుట ఎంత అదృష్టము. అది పరమపావనమైన పవిత్రత వలననే వచ్చును. ఆంతర్యమున పవిత్రత, బాహ్యమున పవిత్రత; పవిత్రత సత్యము నుండియే వచ్చును. సత్యసంధానుభూతులదే పవిత్రత, సత్యము, ఆస్తేయము మొదలైన అష్టవిధములైన పుష్పములతో దైవము నారాధించు వారిదే వాక్‌శుద్ధి.

మన దినచర్యలోగూడ చిన్నచిన్న సంఘటనలలో వాక్‌శుద్ధి వ్యక్తపరచ వచ్చును. కోటగిరి శాంతికేంద్రములో ప్రాతఃకాలమున రాత్రి 6-30 గంటలకు నిత్యము ప్రార్థన భజన జరుగుచుండును. ప్రార్థన మందిరము విద్యుద్దీపముల తోనేగాక, చిన్నచిన్నబల్బులతో అమర్చబడిన సంస్కృత ప్రవణము 'ఓం' రాత్రి ప్రార్థన చేయునపుడు ప్రకాశముగా వెలుంగుచుండును. మొన్న రాత్రి హఠాత్తుగా దీపములు ఆరిపోయెను. ఒక్క లక్ష్మీవిల్లా ప్రార్థన మందిరమందే గాదు. కోటగిరి అంతా దీపములు ఆరిపోయెను. ఎటు చూచినను అంతయు అంధకారమే ఆంతర్యమున చీకటి బాహ్యమున చీకటి, చుట్టును చీకటి, ఆ సమయములో ఒక మహనీయుడు చెప్పిన **అంధకారము నుండియే క్రొత్త వెలుతురు, ప్రకాశము వచ్చును.** అన్న మహావాక్యములు జ్ఞప్తికి వచ్చెను.

మనము చీకటిలోగూడ మార్గములోనే యుంటిమట.

దైవములేని క్షణము లేదుగదా! దైవములేని తావు సూదిమొన మోపుటకైనను లేదుగదా!

దైవము నుండి వచ్చితిమి.
ఇప్పుడు దైవములో నుంటిమి.
మరల దైవములోనే లీనమగుచుంటిమి.

దైవములేని తావు మన జీవితములో ఒక్కక్షణమైనను లేదుగదా! గాన అంధకారములోగూడ మనము దైవములోనే యుంటిమి. దీపములారిపోయెను. దీపములు ఆర్పివేయుట సులభముగదా! ఇంకను చీకటిలోనే యుంటిమి. ఎంత సేపటికి మరల వెలుతురు రానందున, శ్రీరాజాజీ చిన్న కిరసనాయిలు దీపమును



వెలిగించిరి. ఎలక్ట్రిక్ దీపములముందు చిన్న కిర్సనాయిలు దీపము ఎంత అల్పమైనది? అదిగూడ ఏలనో ఆరిపోయెను. కండ్లు మూసినా చీకటే, కండ్లు తెరచినా చీకటియే! ఆ చీకటిలో అటులనే కూర్చొనుట కొంత ఆనందము నిచ్చు చుండెను. ఆశ్రమవాసులు, గురుకుల బాలబాలికలు, భక్తులు చీకటిలోనే ఆనందముగా, వెలుతురునకై చాల ఆతురతతో జూచుచు భజనచేయుచుండిరి. దీపములింకను వెలుగకుండెను. 5 ని॥లయ్యెను. 10 ని॥లయ్యెను. 15-20 ని॥ లయ్యెను గాని ఎంతకును దీపములు వెలుగవాయెను.

కోటగిరి పట్టణమంతయు అంధకారముతో నింపబడెను. అది ఒక విచిత్రమైన అనుభవము. బ్రహ్మవలన నారదున కుపదేశింపబడి కలియుగమునకు మహా మంత్రముగా తలచబడిన-

**ఓం హరేరామ హరేరామ రామరామ హరేహరే**
**హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణకృష్ణ హరేహరే**

అనెడి మహామంత్రమును దీపములు వచ్చెడివరకు విడువకుండా, భక్తి శ్రద్ధలతో పాడమంటిని. ఆంతర్యమున, బాహ్యమున దైవసన్నిధి ననుభవించుచు, హృదయ పూర్వకముగా దైవపరితాపనతో కీర్తించిన తప్పక దీపములు వెలుంగునని చెప్పగానే ఆశ్రమవాసులు, బాలబాలికలు భక్తులందరూ ఆనందముతో పాడసాగిరి. ఒక్క నిమిషము గడచెను. రెండవ నిమిషము గడువకుండగనే హాలు అంతయు వెలుతురుతో ప్రకాశవంతముగా నిండియుండెను. ఎంత ఆనందము, ఎంత అదృష్టము!

ఎటు జూచిన ప్రకాశమే! ఆంతర్యమున జ్యోతి, బాహ్యమున జ్యోతి, అన్నివైపులను జ్యోతి స్వరూపమే! దీపములు వచ్చినను ఆశ్రమభక్తులు, బాలబాలికలు, మహామంత్ర స్మరణను ఆపివేయలేదు. దైవసన్నిధిని అనుభవించుచు ఇంకను పరవశత్వముతో ఓం హరే రామ మంత్రమును కీర్తించసాగిరి.

ఈ తేజస్సు శక్తి అంతయు వాక్‌శుద్ధిలో నున్నదా? లేక, హరే రామ మంత్రములో నున్నదా? వాక్‌శుద్ధిలోనే హరేరామ యుండెను. హరేరాముడుండు చోటనే వాక్‌శుద్ధియు గలదు. వాక్‌శుద్ధి హరేరామ రెండుగావు, ఒక్కటే, వాక్‌శుద్ధి గల్గిన హరేరాములకు ధన్యవాదములు, వారే జ్యోతిస్వరూపులు. శాంతిధాములు.

**లోకాస్సమస్తా స్సుఖినోభవంతు**
**ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః**

# బెంబేలెత్తకు

**ఆలోచిస్తుంటాము**
**ఆలోచన రాదు**
**చదువుతుంటాము**
**అర్థం కాదు**
**నడుస్తుంటాము**
**ఎక్కడికో తెలియదు!**
**జీవితం ఒక్కసారి**
**అలా అయిపోతుంది!**
**బెంబేలెత్తిపోతాం !**
**బావురుమంటాం**
**ఇలానే సాగిపోతే**
**చివరకు ఏమీ మిగలదు.**
**చితి కాకుండానే**
**చితి అవుతాం.**
**కాలకుండానే కాలిపోతాం!**
**బూడిద కాకుండానే**
**బూడిద అవుతాం!**
**అందుకే అనవసరంగా**
**బెంబేలెత్తకు బావురు మనకు**
**చితికాకుండా చితి అయిపోకు.**

**మలిశెట్టి శ్రీనువాస రంగారావు**
**(బన్ను)**

హృదయంలో నున్న వాసనలు నిశ్శేషంగా బయటకు పోకుండా ఏ జీవుడు జ్ఞానికాలేడు. జ్ఞాని కానివాడు ఆత్మ దేవునితో లయం కాలేడు. హృదయంలో ఏ ఒక్క వాసన మిగిలినప్పటికి అది జన్మకు హేతువు అవుతుంది. మోక్షసుఖము మీ అనుభవం లోకి రాకుండ అది అడ్డుపడుతుంది. కోటలో శత్రువులు ఉన్నంతకాలం కోట స్వాధీన మవుతుందా?

**– భగవాన్ రమణమహర్షి**



"జీవుడును సచ్చిదానంద స్వరూపుడే, ఈ మాయలేక అహంకారము ద్వారా నిజస్వరూపమును మరచిపోవును. జ్ఞానము కల్గినచో అహంకారము నశించును.

కామీనీ– కాంచనములలోనే లిప్తమైనట్టి అహంబుద్ధి చాల నీచమైనది. పరమాత్మను, జీవుని వేరు పరచునట్టిది ఈ అహంకారమే సుమా!

ఒకే జలరాశి–దానిలో ఒక కఱ్ఱ అడ్డముగ పెట్టినచో రెండు భాగములుగ కనుపించును. ఆ కఱ్ఱతీసివేసినచో ఒకే జలరాశి. జీవాత్మ పరమాత్మలు రెండు భాగములుగ కనుపించును– అట్లే "అహం" అనెడి కఱ్ఱను తీసివేసినచో ఒకే పరమాత్మ."

**– శ్రీరామకృష్ణ పరమహంస**

యోగము యొక్క ఉద్దేశ్యం మానసిక పరిష్కారం. మనస్సులో పేరుకు పోయిన కుసంస్కారాలను తొలగించి వేయుట మన స్వభావము యొుక్క అంగములుగా మారిన దుష్ప్రవృత్తుల నిర్మూలనలో నిమగ్నమగుటయే యోగము. దానికొరకు భౌతిక వాసనా జ్వాలలను శాంతింపజేయ వలసివస్తుంది. చింతనను ఉత్కృష్టతా రసపానం చేసేందుకు అంగీకరింప చేయాలి. ఆత్మ పరమాత్మల మధ్య అగాధాన్ని పూడ్చవలసి ఉంటుంది. ఈ పనులన్నీ అంతఃపరిశోధన, ఆత్మ పరిష్కారమునకు సంబంధించినవి. అందువలన యోగా సాధన వాస్తవానికి మనస్సును సాధన చేసే విద్యయే.

**–శ్రీరామశర్మ ఆచార్య**

మోక్షము ఏ ప్రత్యేకబాహ్య సన్నివేశములు, సంఘటనల పైనను ఆధారపడి యుండదు. దివ్యజ్ఞానమును పొంది అజ్ఞానమును ఛేదించుకొని అమృత తత్త్వమును సాక్షాత్కరించుకొనుటయేముక్తి. ప్రధానముగా అది మన అంతరంగ ప్రజ్ఞా దృష్టులలో మార్పుమాత్రమే. ఒక వ్యక్తి జ్ఞానలబ్ధికి పూర్వమే పరిస్థితి యందండునో తదుపరిగూడ అదే పరిస్థితిలో నుండును.

**–శ్రీ పప్పా రామదాసు**

## కార్యక్రమములు-మాతృఆశ్రమం

**తేది. 07-12-2024 (శనివారం):** శ్రీ సుబ్రహ్మణ్య షష్టి సందర్భముగా దిగువ ప్రార్థనా మందిరంలో ఉదయం పూజాకార్యక్రమము జరుపబడును.

**తేది. 11-12-2024 (బుధవారం):** గీతాజయంతి పురస్కరించుకొని దిగువ ప్రార్థనా మందిరంలో ఉదయం గీతాపారాయణ జరుగును.

**తేది. 13-12-2024 (శుక్రవారం):** దిగువ ప్రార్థనా మందిరంలో ఉదయం హనుమంతుని పూజ, హనుమాన్ చాలీసా పారాయణ చేయబడును.

**తేది. 15-12-2024 (ఆదివారం):** దత్తజయంతి సందర్భంగా దిగువ ప్రార్థన మందిరములో దత్తపూజ నిర్వహించబడును.

**తేది. 25-12-2024 (బుధవారం):** ఓంకార మందిరములో రాత్రి క్రిస్టమస్ సందర్భంగా ప్రార్థనలు జరుపబడును.

## వార్తలు-మాతృఆశ్రమం

**తేది. 02-11-2024 (శనివారం):** కార్తీక మాసారంభ సందర్భంగా కృష్ణ మందిరంలో గోవర్ధన గిరిధారిపూజ జరిగినది.

**తేది. 04-11-2024 (సోమవారం):** కార్తీకమాస తొలిసోమవారం సందర్భంగా ఉసిరిచెట్టు క్రింద శివకేవవ పూజ నిర్వహించబడినది.

**తేది. 05-11-2024 (మంగళవారం):** నాగులచవితి సందర్భంగా ఆశ్రమ వాసులు, ఆశ్రమ నివాస విద్యార్థులచే ఎగువన వున్న పుట్టవద్ద పూజ నిర్వహించబడినది.

**తేది. 07-11-2024 (గురువారం) నుండి తేది 13-11-2024 (బుధవారం):** వరకు ఆశ్రమవాసులచే శ్రీసాయిసచ్చరిత్రము సప్తాహ పారాయణము జరిగినది.



## దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ. కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435 కు IFSC Code : SBIN0014774 ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమైయిల్ ద్వారా మొబైల్ నంబరు 7382009962 మరియు రిసెప్షన్ నెంబరు 7815890094కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

## శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ.100/-, జీవిత చందా రూ.1000/- (12 సంవత్స రముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం.11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)
వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

## విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు : State Bank of India, 11 Sansad Marg, New Delhi -110001

A/c Name : The Mission of peace - FCRA A/c No : 40127798428

Swift Code : SBININBB104

## విరాళములు

1. శ్రీమతి పి.లక్ష్మి గారు (విశాఖపట్నం) 3,000/-
వస్త్రదానం - అన్నదానం
2. శ్రీ ఎన్. రామకృష్ణరాజు గారు (హైదరాబాదు) 15,000/-
విద్యాఖర్చుల నిమిత్తం
3. శ్రీ గుమ్మళ్ళ వీరభద్రరావు గారు (శాంతిఆశ్రమం) 1,00,000/-
4. శ్రీ వింజమూరి రాధాకృష్ణ గారు, శ్రీమతి యశోద గారు
(కాకినాడ) వీరి 82వ పుట్టినరోజు సందర్భముగా 6,000/-
5. శ్రీ కె.శ్రీనివాసరెడ్డి గారు (విశాఖపట్నం) 10,000/-
6. శ్రీ డి.పురుషోత్తమరావు గారు (విశాఖపట్నం) 3,000/-
7. శ్రీమతి వేల్పూరి సీతాదేవి గారు (విశాఖపట్నం) 12,000/-
వీరి మనుమడు వివాహసందర్భముగా
8. శ్రీమతి ఎన్. కుసుమగారు (హైదరాబాదు) 5,010/-
9. శ్రీమతి & శ్రీ మంజువాణి & కృష్ణరాజు గారు
గో సంరక్షణ నిమిత్తం వీరి తల్లిదండ్రులు (హైదరాబాదు) 20,000/-
ఆర్.ఎస్.రాజు, ఆర్.ఎస్. కుమారిగార్ల జ్ఞాపకార్థం
10. శ్రీ జె.ఎ. శాస్త్రి గారు (సికింద్రాబాదు) 12,000/-
వీరి తల్లిదండ్రులు శ్రీ జె.ఎ.వెంకటేశ్వరరావు గారు,
శ్రీమతి కె.వరలక్ష్మి గార్ల జ్ఞాపకార్థం అన్నదానం
11. శ్రీ ఎస్.ఎమ్. సంజీవికుమార్ గారు (తాడేపల్లిగూడెం) 20,000/-
గోగ్రాసం నిమిత్తం
12. శ్రీ సి.హెచ్.వి.వి. సత్యనారాయణ గారు (కైకలూరు) 20,000/-
విద్యానిధి నిమిత్తం



## శాశ్వతఅన్నదానం

1. శ్రీ దారపు రామారెడ్డి గారు (కాకినాడ) 10,000/-
వీరి తండ్రి శ్రీ కనకమ్మ నర్సింహారెడ్డి గారి జ్ఞాపకార్థం
2. శ్రీ ఐ.వి.సుందర్‌రామం గారు (శాంతిఆశ్రమం)
వీరి భార్య ఐ.శైలజ గారి జ్ఞాపకార్థం 10,000/-
3. శ్రీ జి.జి.కె.ఆర్. ఛారిటబుల్ ట్రస్ట్ (సికింద్రాబాదు)
శ్రీ గాది కృష్ణారావు గారి జ్ఞాపకార్థం 10,000/-
4. శ్రీ ఆకుల అప్పల రాజశేఖర్ గారు (హైదరాబాద్)
వీరి తండ్రి ఎ.అప్పలరాజు గారి జన్మదినం సందర్భముగా 10,000/-


**1. మాతృ ఆశ్రమం**
శ్రీ శాంతి ఆశ్రమము
తోటపల్లి కొండలు,పిన్ : 533 446
వయా శంఖవరం, కాకినాడ జిల్లా
సెల్ :7382009962
రిసెప్షన్ : 7815890094
e-mail : srisanthiashram@gmail.com

**2. విశాఖ : శాంతి ఆశ్రమము**
లాసన్స్‌బే, పెదవాల్తేరు-530 017
విశాఖపట్నం
ఫోన్ : 0891 - 2538689
e-mail : srisanthiashramvsp@gmail.com

**3. విశ్వశాంతి క్షేత్రం**
కైలాసగిరి
విశాఖపట్నం

**4. కోటగిరి శాఖ**
పీస్ సెంటర్, డార్‌మోనా రోడ్,
కోటగిరి-643217, నీలగిరిజిల్లా,
తమిళనాడు,
ఫోన్ : 04266- 271945
e-mail: vsvmsktg@yahoo.com
vsvmsktg@gmail.com

**5. కాకినాడ శాఖ**
శాంతి ఆశ్రమము,అశోక్ నగర్
కాకినాడ - 533 004
కాకినాడ జిల్లా

**6. పిఠాపురం శాఖ**
స్టువర్టు పేట,
పిఠాపురం-533 450
కాకినాడ జిల్లా

Website : www.srisantiashram.org

This Periodical is Registered with Registar of Newspapers, New Delhi Vide R.No. 3447/57,
Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2024-2026

## SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

1. Auto Biography of swami Omkar (2 Volumes) ............ Rs. 150/-
2. Life and Teachings of Swami Omkar ............ Rs. 10/-
3. Soham ............ Rs. 10/-
4. Cosmic Fast ............ Rs. 20/-
5. Meditation ............ Rs. 10/-
6. Om Japa ............ Rs. 10/-
7. Control of Mind ............ Rs. 30/-
8. Cosmic Flashes ............ Rs. 10/-
9. In the Hours of Silence ............ Rs. 10/-
10. The Soul of Omkar ............ Rs. 10/-
11. How I learned English ............ Rs. 10/-
12. Reincarnation of my Little Sister ............ Rs. 10/-
13. God Realization Now and Here ............ Rs. 10/-
14. Mystic Prayers and Poems ............ Rs. 20/-
15. The Divine Voice of Omkar ............ Rs. 40/-
16. Auto Biography of Omkar (Revised Edition) ............ Rs. 100/-
17. Petals of Peace ............ Rs. 20/-
18. The Story of my life and Work ............ Rs. 10/-
19. Priceless legacy of Swami Omkar ............ Rs. 10/-
20. The Four Initiations ............ Rs. 10/-
21. Musings ............ Rs. 20/-
22. Peace Prayer ............ Rs. 20/-

**THE MISSION OF PEACE**
**శ్రీ శాంతి ఆశ్రమము**
పోస్టు: శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446
కాకినాడ జిల్లా, (ఆం.ప్ర.)
ఫోన్ : 7382009962
email: srisanthiashram@gmail.com
www: www.srisantiashram.org

Book Post

______________________________

______________________________

______________________________

Published by MVV Satyanarayana on behalf of The Mission of Peace - Sri Santi Ashram and printed at Mohan Graphics, Kakinada - 533 001. Ph:0884-2361419 and Published at Thotapalli Hills-533 446, Ph: 73820 09962 Editor : Swamini Vinamrananda